# కథ

# మాయాబజార్

-వాణిశ్రీ

**"కుర్రాడి పేరు ఎ.ఆర్. కోటప్పకొండ" అన్నాడు తిరుమలరావు.**

**"అదేం పేరు? పేరు చెప్తేనే మా లత మండిపడుతుంది. ఈ రోజుల్లో అటువంటి పేరేంటి కుర్రాడికి? కోటప్పకొండ, తిరుపతి కొండ, అప్పలకొండ, ఏడుకొండలు?" అని నవ్వాడు రాంప్రసాద్.**

**"అది కుర్రాడిపేరు కాదు. ఇంటి పేరు కోటప్పకొండ. కుర్రాడి పేరు ఆదిత్యరామ్. అమెరికాలో మన వాళ్ళు పేరును పొడి అక్షరాలలో ఇంటిపేరుని పూర్తిగాను పాపులర్ చేస్తున్నారు" చెప్పాడు తిరుమలరావు.**

''అదా సంగతి! నేను పేరు అనుకున్నాలే. చెప్పు కుర్రాడు ఇండియాలో ఎన్నాళ్ళుంటాడు?''

''నెల రోజులుంటాడు. అమ్మాయి నచ్చితే వెంటనే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతాడు''

రాంప్రసాద్ ఆదిత్యరామ్ ఫోటో పరీక్షగా చూశాడు. 'ఫోటోలో బాగానే వున్నాడు. ఈ మధ్య అంతా ఫ్యాషన్ ఫోటో స్టూడియోల్లో మేకప్‌లు వేసుకుని దిగుతున్నారు. ఫోటోల్లో అందంగానే కనిపిస్తారు. మనిషిని చూస్తేగాని రంగు తెలియదు' అనుకున్నాడు.

''సొంతంగా సాఫ్ట్‌వేర్ బిజినెస్ వుంది. స్వంత ఇల్లుంది. కార్లున్నాయి. కుర్రాడు మంచోడే. నువ్వు ముందు అతన్ని కలిసి మాట్లాడు. అక్క ఇంట్లో వుంటున్నాడు. అన్నీ నీకు సంతృప్తిగా వుంటే వచ్చి అమ్మాయిని చూసుకోమని చెప్పు. తర్వాత నేను అన్ని విషయాలు ఫైనలైజ్ చేస్తాను'' అన్నాడు రాంప్రసాద్‌తో తిరుమలరావు.

రాంప్రసాద్ తల వూపాడు.

★ ★ ★

బంజారాహిల్స్‌లో అది ఇండిపెండెంటంహౌస్.

గేట్లోవున్న గూర్ఖా వాచ్‌మెన్ క్యాబిన్‌లో నుంచే వీడియోఫోన్లో మాట్లాడాడు. రాంప్రసాద్‌ని మాట్లాడమన్నాడు.

''నన్ను తిరుమలరావు పంపించాడు. మా అమ్మాయితో మ్యాచ్ గురించి'' చెప్పాడు రాంప్రసాద్.

''రండి, ఐయామ్ సురేష్ కుమార్. ఆదిత్య మా బావమరిదే'' అన్నాడు.

రాంప్రసాద్‌ని రిసీవ్ చేసుకుని షేక్‌హాండ్ ఇచ్చాడు. సురేష్‌కుమార్, తన భార్య సునందను పరిచయం చేశాడు. కొంచెంసేపు వృత్తి విశేషాలు మాట్లాడుకున్నారు. సురేష్‌కుమార్ తను కన్‌స్ట్రక్షన్ కంపెనీ యం.డీనని చెప్పాడు. పెరిగిపోతున్న రేట్లు, బిజినెస్‌లో కాంపిటీషన్ గురించి చర్చించారు.

రాంప్రసాద్ తన కూతురు ఫోటో ఇచ్చాడు. బయోడేటా ప్రింట్ చేసిన పేపర్ ఇచ్చాడు.

''బి.టెక్. పూర్తయింది. మేచ్ కుదిరితే పెళ్ళి చేస్తాం. లేకపోతే తను యం.టెక్ చేస్తానంటోంది'' అన్నాడు రాంప్రసాద్.

''మావాడు పైన బిజీగా వున్నాడు. ఏమిటో ఇండియా వచ్చినా కంప్యూటర్‌ని వదిలిపెట్టడు'' అని నవ్వి సెల్‌నుంచి ఆదిత్యతో మాట్లాడాడు.

తెల్లటి లాల్చీ, పైజామాతో అందంగా వున్న ఆదిత్యరామ్ వచ్చి విష్ చేశాడు. కుర్రాడు ఫోటోలో వున్నట్లే వున్నాడు అని తృప్తి పడ్డాడు రాంప్రసాద్.

సురేష్‌కుమార్ రాంప్రసాద్‌ని పరిచయం చేసి అమ్మాయి ఫోటో, బయోడేటా అందించాడు.

ఆదిత్యరామ్ అవి చూసి ''అంకుల్ మనం మాట్లాడుకుందాం రండి'' అని లేచాడు.

పైన వున్న రూమ్‌లోకి రాంప్రసాద్‌ని తీసుకువెళ్ళాడు. అక్కడ రెండు కంప్యూటర్లు వున్నాయి. ఒక ఛైర్‌లో తను కూర్చుని, రెండో కంప్యూటర్ ముందున్న ఛైర్‌లో కూర్చోమని రాంప్రసాద్‌కి చెప్పాడు.

రాంప్రసాద్ ఆ గదంతా కలయచూస్తున్నాడు.

''ప్లీజ్ అంకుల్. ఫైవ్ మినిట్స్. ఈ లోపల ఈ ఇయర్ ఫోన్ పెట్టుకోండి. మంచి సాంగ్స్ వినిపిస్తాయి'' అని ఇయర్ ఫోన్ అందించాడు.

రాంప్రసాద్ ఇయర్ ఫోన్ చెవిలో పెట్టుకున్నాడు.

ఆదిత్యరామ్ కంప్యూటర్ ముందు కూర్చుని మౌస్‌ని నొక్కుతున్నాడు.

రాంప్రసాద్ చెవిలో సాంగ్స్ వినిపిస్తున్నాయి. కాని మనసు మాత్రం ఆదిత్యరామ్ గురించి ఆలోచిస్తోంది.

ఈ మధ్య అమెరికా సంబంధాలంటే తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని ఇవ్వడానికి భయపడుతున్నారు. పేపర్లలో వచ్చే న్యూస్, టీవీలలో వార్తా కథనాలు చూసి బెంబేలెత్తిపోతున్నారు.

అక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగమని లక్షల్లో కట్నం గుంజి పెళ్ళి చేసుకుని పిల్లని తీసుకెళ్తాడు. వాడక్కడ ఏ పెట్రోలు బంకులోనో, సూపర్ మార్కెట్‌లోనో గంటకిన్ని డాలర్లు అని పని చేస్తుంటాడు.

ఇంకొకడు ఆల్రెడీ అక్కడొక పెళ్ళి చేసుకుని కాపురం చేస్తుంటాడు. పెళ్ళి కాలేదని అబద్ధాలాడి మరొక పెళ్ళి చేసుకుని పిల్లని కాపురానికి తీసుకెళ్తాడు. తీరా వెళ్లాక తెలుస్తుంది తనకొక సవతి వుందని.

మరొకడు కట్నం చాలలేదని, ఇండియాకి తిప్పి పంపుతాడు. వాడి ధనదాహం తీరనిది.

కొందరు అక్కడ తమ ఇల్లు కోట్లు ఖరీదు చేస్తుందనీ, తమ ఇంట్లో మనిషికొక కారుందనీ, సొంతంగా బిజినెస్ వుందనీ కోతలు కోసి పెళ్ళి చేసుకుంటారు. అక్కడ ఏమీ వుండదు.

ఈ అమెరికా మోసాలు చూస్తుంటే తనకీ భయంగానే వుంది. ఇండియా సంబంధమంటేనే తనకి ఇష్టం. కాని తన క్లోజ్‌ఫ్రెండ్ తిరుమలరావు మంచి సంబంధమనీ, వారి కుటుంబం ఎంతో నీతి నిజాయితీ కలదనీ చెప్తే తను మొగ్గు చూపాడు. కాని అమెరికాలో సంగతి తిరుమలరావుకి మాత్రం ఏం తెలుసు? వాళ్ళు చెప్పింది నమ్ముతాడు.


ఈ ఆదిత్యరామ్ కోటప్పకొండ ఎటువంటివాడో? సాఫ్ట్‌వేర్ బిజినెస్ వుందో లేదో? సొంత ఇల్లు నిజమో కాదో? ఎవరికి తెలుసు?

ఇండియాలో అయితే వారినీ, వీరినీ విచారించి నిజం తెలుసుకోవచ్చు. కాని అమెరికాలో వుండే వాడి గురించి ఎవరు చెప్తారు?

రాంప్రసాద్ నిట్టూర్చాడు.

ఆదిత్యరామ్ మౌస్ వదిలేసి, రాంప్రసాద్ వైపు తిరిగాడు. చిరునవ్వు నవ్వాడు.

''అంకుల్! మీ డౌట్లన్నీ కొందరి గురించి నిజమే. చాలామంది మోసం చేయడం వల్ల అమెరికాలో వుండే ఇండియన్స్‌కి చెడ్డపేరు వస్తోంది. ఎన్ని నదులు కలిసినా, ఎంత వర్షం కురిసినా సముద్రం నిండడం అనేది వుండదు. అలాగే కొందరికి ఎన్ని కోట్లు సంపాదించినా ధన దాహం తీరదు. ఏం చేస్తాం?''



రామ్‌ప్రసాద్ ఆశ్చర్యంతో చూశాడు.

''నా విషయంలో మీ అనుమానాలు నిజం కాదు. తిరుమలరావు చెప్పినట్లు మా కుటుంబం నీతి, నిజాయితీలకు మారుపేరు. గుంటూరులో మా తాత వెంకటసుబ్బయ్య కోటప్పకొండ లక్షలు సంపాదించే లాయర్ ప్రాక్టీస్ మానేసి ఆ రోజుల్లో పాతిక లక్షలు స్వాతంత్ర్యోద్యమం కోసం ఖర్చుచేశాడు. ఆయన రక్తం మాలో ప్రవహిస్తున్నది. మోసం, దగా, కుట్ర, కుతంత్రాలు మా వంశంలో లేవు. నాకు సాఫ్ట్‌వేర్ బిజినెస్ వుంది. సొంత ఇల్లుంది. అది పదికోట్లు ఖరీదు చేస్తుంది. నాకు నాలుగు కార్లున్నాయి. ఎంతవున్నా మీ అమ్మాయి నాకు నచ్చితే నాతోపాటు మా కంపెనీలో పని చేయాల్సి వుంటుంది. నేను మీ లతతో మాట్లాడతాను'' చెప్పాడు ఆదిత్యరామ్.

రామ్‌ప్రసాద్ తెల్లముఖం వేశాడు. 'తను నోరు విప్పకముందే తన మనసులో ఆలోచనలు చదివినట్లు ఎట్లా చెప్పేశాడు. ఆశ్చర్యంగా వుందే?' అనుకున్నాడు.

''ఆశ్చర్యపోకండి. నేను మీ మనసులో ఏమనుకుంటున్నదీ గ్రహించగలను'' నవ్వుతూ అన్నాడు ఆదిత్యరామ్.

''ఎలా? టెలిపతీ వంటి విద్యలేమైనా తెలుసా?'' అడిగాడు రాంప్రసాద్.

''అటువంటి విద్యలేం లేవు. నేను కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్ చేశాను. మీ ముందున్న కంప్యూటర్‌లో బ్రెయిన్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఫీడ్ చేశాను. దానిముందు కూర్చుని వున్నవారి మెదడులో మెదిలే ఆలోచనలు పసిగట్టి చేరవేస్తుంది. దానిపేరు మాయాబజార్ సాఫ్ట్‌వేర్. ఇది మార్కెట్ చేస్తే ప్రపంచంలో రహస్యాలు వుండవు. నేరాలు చిటికెలో పరిష్కారమై పోతాయి'' నవ్వుతూ చెప్పాడు ఆదిత్యరామ్.

★ ★ ★

''కోటప్పకొండని చూసొచ్చావా? నాలుగు రోజులైంది నీ నుంచి ఫోన్ వస్తుందని చూశాను. ఫోన్‌గూడా చెయ్యలేదేంటి?'' కాల్‌చేసి అడిగాడు తిరుమలరావు.

''ఆ కోటప్పకొండ సంబంధం వద్దనుకున్నాంలే'' అన్నాడు రాంప్రసాద్.

''ఏం కుర్రాడు నచ్చలేదా?''

''కుర్రాడు బాగానే వున్నాడ్లే. కానీ అదో టైపులా వున్నాడు''

''అంటే....''

''ఏంటో మాయాబజార్ సాఫ్ట్‌వేరంట. కనిపెట్టాడంట. ఆ కంప్యూటర్ ముందు కూర్చుంటే మనిషి మనసులో అనుకుంటున్న మాటలన్నీ కనిపెట్టేస్తుందన్నమాట. దానిముందు కూర్చోబెట్టి నేను మనసులో అనుకుంటున్నవన్నీ చెప్పేశాడు. వద్దురా బాబూ! అటువంటి అల్లుడు''

''అతనిది కంప్యూటర్ బిజినెస్ గదా! ఏవో కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ కనిపెడుతుంటాడు. అవన్నీ నీకెందుకు?''

''భలేవాడివే! అటువంటి కంప్యూటర్‌గాడిని పెళ్ళి చేసుకుని మా అమ్మాయి ఏం సుఖపడుతుంది చెప్పు. పూర్వం జమదగ్ని మహర్షి, భార్య తన మనసులో ఎవడినో మెచ్చుకుందని తల నరికించాడు చూడు అట్లా వుంటుంది. చీటికి మాటికి కంప్యూటర్ ముందు కూర్చోబెట్టి నువ్వు ఫలానా వాడిమీద మోజుపడ్డావు. వాడెవడో సినిమా హీరో కండల్ని మెచ్చుకున్నావు. మనసులో నన్ను తిట్టుకున్నావు అని రోజూ సతాయించడూ! మనిషి మనసులో ఎన్నో అనుకుంటుంటాడు. ఎన్నో రహస్యాలు దాచుకుంటాడు. అవన్నీ బట్టబయలు చేసేస్తే ఇంకేం సుఖం వుంటుంది చెప్పు. అందుకనే ఆ కోటప్పకొండ సంబంధం వద్దనుకున్నాం'' చెప్పాడు రాంప్రసాద్.

☆